క్లుప్తంగా

జ్యూస్‌తో విద్యార్థులకు స్వాగతం



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): నూతన విద్యా సంవత్సరం 2023–24 ప్రారంభం సందర్భంగా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వెల్‌కం జ్యూస్‌తో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పీవీ సత్యకుమార్ మాట్లాడుతూ.. పాఠశాలపై అభిరుచిని పెంచి విద్య అభ్యసించడానికి విద్యార్థులను సాదరంగా తరగతి గదులకు ఆహ్వానించడానికి వెల్‌కం జ్యూస్‌తో వేడుక జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్వేత, ఉపాధ్యాయుడు శివాజీ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాయకమ్మ ఆలయ ఉత్సవాలు



విగ్రహ ఊరేగింపులో భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన నాయకమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురారోపణంతో పాటు అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

మా భూముల నుంచి కాల్వలు తవ్వొద్దు



వినతిపత్రం అందిస్తున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మా పట్టా భూముల నుంచి ఎలాంటి చిన్న కాల్వలు కూడా తవ్వొద్దని చిన్నకోడూరు గ్రామానికి చెందిన రైతులు సోమవారం సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని 06–33 గుంటల భూమి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మైనర్ కాల్వకు అవసరమని సంబంధిత అధికారులు చెప్పారన్నారు. మాకు ఎలాంటి కాల్వలు వద్దని, మా పక్కనే రంగనాయక సాగర్ రిజర్వాయర్, పెద్ద చెరువు ఉందని తెలిపారు. మా వ్యవసాయ భూమి నుంచి ఎలాంటి మైనర్ కాల్వలు తీయరాదని రైతులందరూ తీర్మానించినట్లు తెలిపారు.

విద్యార్థుల హాజరుపై ఆరా

చేర్యాల(సిద్దిపేట): వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. సెలవులు ముగిసినా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం కారణంగా విద్యార్థుల హాజరుశాతం తగ్గింది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొత్తం 3,170 మంది విద్యార్థులకు గాను 1,478 (46.6 శాతం) మంది విద్యార్థులు మాత్రమే మొదటిరోజు హాజరైనట్లు ఎంఈఓ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పెద్దమ్మగడ్డ బాలుర పాఠశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు హాజరైన విద్యార్థుల, ఉపాధ్యాయుల సంఖ్యతో పాటు విద్యార్థులకు కల్పించిన వసతులపై ఆరా తీశారు.

సౌకర్యాలు కల్పించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కిచెన్ గది నిర్మాణం, స్కావెంజర్లను నియమించాలన్నారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కుందనవానిపల్లి గ్రామ పరిధి చౌటకుంట తండాలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ మోబినాయక్ కుటుంబానికి పదో తరగతి మిత్రబృందం సాయం అందించారు. సోమవారం రూ.23,500ల నగదును కుటుంబసభ్యులకు అందజేశారు. తిరుపతిరెడ్డి, సంపత్‌రెడ్డి, పద్మనాభం, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే, 3కే రన్ పోటీలు



గజ్వేల్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: మార్నింగ్ వాక్, వ్యాయామం చేయడంతో దేహదారుఢ్యం పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వారు హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుంచి ఇందిరా పార్క్ నుంచి ఐఓసీ మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ వరకు ఈ రన్ కొనసాగింది. ఈ సందర్భంగా యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ.. యువతను పోత్సహించడానికి పోలీస్ శాఖ 2కే రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 3కే రన్ పోటీలను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో గతంలో కూడా పరుగు పందెం పోటీలు నిర్వహించారని యువత, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారని, తెలంగాణ అవతరణ ఉత్సవాల్లో భాగంగా రన్‌ను విజయవంతంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్నాబాద్‌లో ప్రగతి అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రోజు రోజుకు అభివృద్ధి, సంక్షేమం వేగం పుంజుకుంటుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్, ఎస్సై మహేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, ఎమ్మెల్యే తనయుడు ఇంద్రనీల్, కౌన్సిలర్ భాగ్యరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

దుబ్బాక: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక పట్టణంలో నియోజకవర్గ స్థాయి 2కే రన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో దాదాపు 200 మంది పైగా యువకులు పాల్గొన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన యువకులకు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్, మిరుదొడ్డి ఎస్ఐ శ్రీధర్‌గౌడ్, భూంపల్లి ఎస్ఐ గంగరాజు, కౌన్సిలర్ పులిగారి కల్పనఎల్లం, స్వామి, నాయకులు రాజిరెడ్డి, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ విమలారెడ్డి, పీఈటీలు దేవరాజ్, రవి, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.



దుబ్బాక: రన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



హుస్నాబాద్: విజేతలతో కలిసి విజయకేతనం చూపిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ఇంటింటికీ భగీరథ నీరు అందించాం

హుస్నాబాద్ రూరల్ మండల సమావేశంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: మండే ఎండాకాలంలోనూ ఏ పల్లెలో తాగునీటి సమస్య లేకుండా ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో అభివృద్ధిపై చర్చ జరుగుతున్న క్రమంలో సర్పంచ్‌లు గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలను ఎత్తి చూపించారు. వ్యవసాయ బావుల వద్ద లూజ్‌లైన్లకు స్తంభాలు కావాలని మాలపల్లి సర్పంచ్ మల్లయ్య అడగడంతో నెలరోజుల్లో స్తంభాలు వస్తాయని, మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గానికి తాగునీరు అందించేందుకు మహ్మదాపూర్ గ్రామంలో 75 లక్షల లీటర్ల సంపును నిర్మాణం చేసుకొని పల్లె పల్లెకూ మిషన్ భగీరథ నీరు అందిస్తున్నామని చెప్పారు. పోతారం(ఎస్) గ్రామానికి మిషన్ భగీరథ తాగునీరు రాకపోవడానికి కారణం అధికారుల నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ వారి సిబ్బందిని తీసుకొని మంగళవారం గ్రామానికి వెళ్లి తాగునీటి సరఫరాలో వచ్చే సమస్యను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను నేను ఇస్తానని పనులు చేయించాలని చెప్పారు. గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలకు ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరైన పనులు చేయడం లేదని అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా చెరువులకు గోదావరి జలాలు వస్తాయని నీటి కాల్వలకు మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీడీఓ కుమారస్వామి, పీఆర్‌డీఈ సదాశివారెడ్డి, బాల్‌రాజు, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించని ఏఓ మాకొద్దు

అక్కన్నపేట మండల సమావేశంలో ప్లకార్డులతో సర్పంచ్‌ల నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ ప్రారంభంలో కాంగ్రెస్ సర్పంచ్‌లు ముత్యాల సంజీవ్‌రెడ్డి, బద్దం రాజిరెడ్డి, ఎంపీటీసీలు భూపతి సుదేష్ణ, గొర్ల స్వప్నలు సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్లకార్డులను పట్టుకొని నిరసనకు దిగారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని, వ్యవసాయ అధికారి, హార్టికల్చర్ అధికారులను వెంటనే నియమించాలని, రైతులకు ధాన్యం డబ్బులు త్వరితగతిన వారి అకౌంట్లో జమ చేయాలని దాదాపు 25 నిమిషాల పాటు సభలో నిరసన గళం వినిపించారు. దీంతో అధికార పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వర్సెస్ కాంగ్రెస్ సర్పంచ్‌ల, ఎంపీటీసీల మధ్య కొంత వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో ఎంపీపీ లక్ష్మి కలగజేసుకొని ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని నిరసనలు తెలపకుండా కూర్చోవాలని చెప్పారు. దీంతో నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్లకార్డులను తీసివేసి సభలో కూర్చున్నారు. అనంతరం సభ సజావుగా కొనసాగింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకొని 10నెలలు గడిచిన మండలానికి ఐదారు సార్లు కూడా రానీ ఇన్‌చార్జి ఏఓ భోగేశ్వర్ స్వామి మాకొద్దని ప్రజాప్రతినిధులందరూ ఆవేదన వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎలాంటి తనిఖీలు చేయడం లేదని, తద్వారా రైతులకు పొట్టి విత్తనాలు విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయని సభలో సర్పంచ్‌లు మండిపడ్డారు.

జరిమానా విధించాలి..

మండలంలోని గొల్లకుంట గ్రామంలో రోడ్డుకిరువైపులా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు పెరిగి పెద్దవృక్షాలుగా పెరిగి నీడనిచ్చాయని, గ్రామంలో ఓ వ్యక్తి నీడనిచ్చే మూడు పెద్దవృక్షాలను నేలమట్టం చేయడంపై అధికారులు చర్యలు తీసుకోవడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారో అర్థం కావడం లేదని ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు సభలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డిని నిలదీశారు. చెట్లు నరికివేత అంటూ అని సాక్షిలో వచ్చిన కథనంపై సభలో పత్రికకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, జరిమానా కూడా విధిస్తామన్నారు. మధ్యాహ్నం తర్వాత సర్వసభ సమావేశానికి హాజరై ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడారు. మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అన్నీ హంగులతో మిగిలిన మండలాలకు ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మండల కేంద్రంలో సమీకృత భవనాల నిర్మాణానికి స్థల సేకరణ కూడా పూర్తయిందని, నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగ, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, పంచాయతీ రాజ్ డీఈ సదాశివరెడ్డి, మిషన్ భగీరథ ఇంట్రా డీఈ బాల్‌రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



దుబ్బాకలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ వనిత తదితరులు

దుబ్బాకటౌన్: సీఎం కేసీఆర్ అడగకుండానే వరాలిచ్చే గొప్ప ప్రజానాయకుడని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు తమకు పింఛన్ 4016కు పెంచడంపై సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో నిలిచాడన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు తదితరులు ఉన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని దివ్యాంగులు ఆ సంఘం మండల అధ్యక్షుడు పంజాల నర్సాగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఒకరికొకరు స్వీట్లు పంచిపెట్టుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విజ్జపల్లి రాజేశ్వర్‌రావు, పొడేటి రాజు, యాదవ్వ, రాజయ్య, సత్తయ్య, దుర్గయ్య, నర్సవ్వ పాల్గొన్నారు.

ఐటీ టవర్ ఏర్పాటు జిల్లాకు వరం

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లాలో ఏర్పాటు చేసిన ఐటీ టవర్ జిల్లా యువతకు వరం లాంటిదని జిల్లా బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు మహేశ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15న ఐటీ టవర్ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు యువత పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఐటీ హబ్‌లో 11 ప్రముఖ కంపెనీలు 1600 మంది యువతకు ఉద్యోగాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. 15న జరిగే ఐటీ టవర్ ప్రారంభ వేడుకకు పెద్ద ఎత్తున యువత రావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, యాదగిరి, శ్యామ్, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ పరిశీలకుడు వి.రంగారావు సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. 02, మార్చి 2023 నుంచి 12, జూన్ 2023 వరకు 103 రోజులకు గాను రూ.8,05,385లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథశర్మ తెలిపారు. ఈ డబ్బులను యూనియన్ బ్యాంక్ హుస్నాబాద్ బ్రాంచ్‌లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పూదరి లక్ష్మినారాయణ గౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం, సత్యసాయి సేవా సమితి, గోమాత భజన మండలి, వాసవివనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





తొలిరోజే తిప్పలు

విద్యాసంవత్సరం ప్రారంభమైన తొలిరోజే విద్యార్థినులకు తిప్పలు తప్పలేదు. పాఠశాల తరగతి గదులకు తాళం తీసేవారు లేక ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యార్థులు ఎదురు చూడాల్సి వచ్చింది. అంతంతమాత్రంగా వచ్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రార్థన గీతం పాడించి మమ అనిపించారు. విద్యార్థులతో కుర్చీలు, క్లాస్ రూమ్‌లను శుభ్రం చేయించిన ఘటన సిద్దిపేట పట్టణంలోని బాలిక హైస్కూల్‌లో చోటుచేసుకుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బహుమతితో పాటు నగదు పురస్కారం అందుకుంటున్న వడియారం క్రీడా జట్టు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజాహిత ఫౌండేషన్ సౌజన్యంతో మంజీరా యూత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గ వాలీబాల్ టోర్నీ ఆదివారం రాత్రి ముగిసింది. ప్రథమ స్థానంలో నిలిచిన వడియారం జట్టుకు బహుమతితో పాటు రూ.14వేల నగదు పురస్కారం, ద్వితీయ స్థానంలో నిలిచిన మిరుదొడ్డి జట్టుకు బహుమతితో పాటు, రూ.10వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన ఇబ్రహీంపూర్ జట్టుకు రూ.5వేలు, కాన్గల్ జట్టుకు రూ. 2500 నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఎంపీటీసీ నర్సింలు, నాయకులు లింగం, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారం కుమార్, మల్లయ్య, లక్ష్మణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నంట బాపురెడ్డి, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, మంజీరా యూత్ అధ్యక్షుడు తోట వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేపు కుకునూరుపల్లిలో వేలం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని తైబజార్, షాపింగ్ కాంప్లెక్స్, వీలేజ్ ఫంక్షన్ హాళ్ల నిర్వహణకు (ఈ నెల 14న)బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి మమత తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గంట ముందే వచ్చి రూ.10వేలు గ్రామ పంచాయతీలో డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన పాఠ్యాంశాలు బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ తెలిపారు. పాఠశాలలో హిందీ, ఇంగ్లిష్, భౌతిక శాస్త్రం బోధించేందుకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

◆ వైభవంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లిలో పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వస్తి పుణ్యాహవాచనం, విఘ్నేశ్వర పూజ, పంచగవ్య ప్రాశనాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం తదితర కార్యక్రమాలు జరిగాయి.

◆ కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు, రామంచ, చిన్నకోడూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏపీఎం మహిపాల్ సందర్శించారు. రైతులు, నిర్వాహకుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండలంలో 13 ఐకేపీ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 537 లారీల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.



పెద్దకోడూరులో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న ఏపీఎం మహిపాల్

◆ విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ గజ్జెల సాయిలు అన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలను సోమవారం ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు అందజేశారు. అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభు దాస్, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కొత్త రాజిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లింగం, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ అన్నదాతల్లో మనోధైర్యం నింపుతున్న ప్రధాని మోదీ

గజ్వేల్‌రూరల్: రైతులు సాగుచేసిన వివిధ రకాల ఉత్పత్తులకు మద్దతు ధరను పెంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్నదాతల్లో మనోధైర్యం నింపుతున్నట్లు బీజేపీ కిసాన్ మోర్చా గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మార్కంటి ఏగొండ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 15 రకాల పంటలకు మద్దతు ధర పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.